ప్రధానికి నివేదికను సమర్పించిన కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సమక్షంలో సామాజిక అభివృద్ధిపై కర్నూలు కలెక్టర్ డాక్టర్ జి.సృజన జిల్లాలో నెలకొన్న పరిస్థితులకు సంబంధించి నివేదికను సమర్పించారు. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో యాస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ అంశంపై జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో ఈ నెల 26 నుంచి 29 వరకు సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశాలకు హాజరయ్యేందుకు దేశంలోని 5 రాష్ట్రాల నుంచి 5 జిల్లాల కలెక్టర్లు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కర్నూలు కలెక్టర్ డాక్టర్ జి.సృజన సమావేశాలకు హాజరయ్యారు. గురువారం ప్రధానమంత్రి ముందు జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణ, రక్తహీనత పరీక్షల నిర్వహణ, రక్త హీనత నివారణకు తీసుకుంటున్న చర్యలు, విద్యాభివృద్ధి తదితర అంశాలపై కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కర్నూలు తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మూడు రాష్ట్రాలకు జంక్షన్‌గా ఉన్న జిల్లా అని, హైదరాబాదు, బెంగళూరు లాంటి అభివృద్ధి చెందిన ప్రదేశాలకు మధ్యలో ఉన్న జిల్లా, వ్యవసాయం మీద ఆధారపడిన జిల్లా అని కలెక్టర్ పరిచయం చేశారు. కర్నూలు జిల్లాలో హోళగుంద, మద్దికెర, చిప్పగిరి ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం యాస్పిరేషనల్ బ్లాక్స్‌గా గుర్తించిందని తెలిపారు. ఈ ప్రాంతాల్లో సిఇఎస్ఎస్ ప్రకారం 70 శాతం సీజనల్‌గా వలసలు వెళ్తున్నట్లు గుర్తించిందన్నారు. వెనుకబాటుతనం వల్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమస్యకు కారణం నిరక్షరాస్యత, పేదరికం, మూఢనమ్మకాలు అని వివరించారు. జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో 60 (96.7 శాతం) బాల్యవివాహాలను ఆపగలిగామన్నారు. గ్రామ సచివాలయాలు చైల్డ్ మ్యారేజ్ ప్రివెన్షన్ యూనిట్లుగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. హోళగుంద సమీపంలోని పెద్దహరివాణం గ్రామానికి చెందిన నిర్మలను ఉదాహరణగా కలెక్టర్ వివరించారు. నిర్మల చాలా తెలివైన అమ్మాయి అని, పదో తరగతిలో 90 శాతానికి పైగా మార్కులు సాధించారని తెలిపారు. ఈ అమ్మాయి తన కుటుంబ నేపథ్యం కారణంగా కళాశాలకు వెళ్లకుండా వ్యవసాయ కూలీగా పనికి వెళ్తూ పెళ్లికి సిద్ధపడాల్సి వచ్చిందని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో ఆ అమ్మాయి బాల్యవివాహాన్ని నిరోధించి ఇంటర్మీడియట్‌లో చేర్పించి చదివిస్తున్నట్లు వివరించారు. తల్లిదండ్రులకు సరైన అవగాహన కల్పించి వారిలో మార్పు తీసుకు రావడానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. బాలిక విద్యను మరింత ప్రోత్సహించే విధంగా, జిల్లాలో మరింత మంది నిర్మలలను చూసే దిశగా చర్యలు తీసుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన, సామాజిక, ఆర్థికాభివృద్ధితో కూడిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.

వివరిస్తున్న కలెక్టర్

ఎమ్మెల్యే ఇంటి ముట్టడి

- 17వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్/హాస్పిటల్

అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కరించాలని చేస్తున్న సమ్మె 17వ రోజుకు చేరుకుంది. కల్లూరు చెన్నమ్మ సర్కిల్ నుండి వందలాది మంది అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి పాణ్యం శాసన సభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఇంటిని ముట్టడించారు. పెద్దఎత్తున నినాదాలు చేశారు. కనీస వేతనం రూ.26 వేలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.5 లక్షలు గ్రాట్యుటీ ఇవ్వాలని, జగన్మోహన్ రెడ్డి తెలంగాణ కన్నా వెయ్యి ఎక్కువ ఇస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని, యాప్‌లను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఎమ్మెల్యే కాటసాని బయటకు వచ్చి ప్రభుత్వం అంగన్వాడీల పట్ల సానుకూలంగా ఉందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని. కొన్ని డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిందని వారు తెలిపారు. తమకుకనీస వేతనాలు అమలు చేయాలని అంగన్‌వాడీలు తెలిపారు. అనంతరం ధర్నా చౌక్ శిబిరం వద్దకు వెళ్లారు. అక్కడ జరిగిన కార్యక్రమంలో ఎఐటియుసి నగర కార్యదర్శి ఏ చంద్రశేఖర్, సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఎస్.మహమ్మద్ రఫీ అధ్యక్షత వహించారు. పలు ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్.సాయిబాబా, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు బి.రామన్న, అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.నిర్మల, టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు ధర్నా శిబిరానికి హాజరై మాట్లాడారు. అంగన్వాడీలు తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని సమ్మె చేసున్నా ఈ ప్రభుత్వానికి ఎటువంటి చలనం లేదన్నారు. అనేక సేవలు చేస్తున్న అంగన్వాడీలను గుర్తించకపోవడం ప్రభుత్వం చేతకానితనం అన్నారు. నాలుగు సంవత్సరాలుగా నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. శిబిరం దగ్గర అంగన్వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కబడ్డీ ఆడి తమ నిరసనను తెలియజేశారు. **గూడూరులో** అంగన్వాడీలు పోస్ట్ కార్డుల ఉద్యమం చేపట్టారు. దాదాపు 200 మంది అంగన్వాడీలు పోస్ట్ కార్డులపై ముఖ్యమంత్రికి సమస్యలను గూడూరులోని పోస్ట్ ఆఫీస్ ముందు ఉన్న పోస్టు డబ్బాలో వేశారు. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు నాయకులు సుహాసిని, అరుణ, రాజేశ్వరి, ఇందుమతి, సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్ మాట్లాడారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు మద్దమ్మ, అనంతమ్మ, రత్నమ్మ, మంజుల, అన్నామని, మహేశ్వరి, లక్ష్మి, కళావతి పాల్గొన్నారు. **పత్తికొండలో** ప్లేట్లతో నిరసన చేపట్టారు. దీక్ష శిబిరం నుంచి అంగన్వాడీ యూనియన్ నాయకులు సిఐటియు ఆధ్వర్యంలో ప్లేట్లతో ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. సిఐటియు జిల్లా నాయకులు చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, మండల కార్యదర్శి గోపాల్, సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి మాట్లాడారు. అనంతరం ఆర్‌డిఒ రామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ప్రజానాట్యమండలి నాయకులు రమేష్, వ్యకాస మండల కార్యదర్శి సురేంద్ర, అంగన్వాడీ యూనియన్ నాయకులు శోభా, కాంతమ్మ, లక్ష్మి, పద్మ, రమాదేవి, గిరిజ, భాగ్య, లక్ష్మీదేవి, ఉమాదేవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాటసాని ఇంటిని ముట్టడించిన నాయకులు


మద్దతుగా మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు

శిబిరం వద్ద కబడ్డీ ఆడుతున్న అంగన్వాడీలు

కెవిఆర్ అధ్యాపకురాలికి డాక్టరేట్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలోని కెవిఆర్ ప్రభుత్వ మహిళ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న బి.నిఖితకు డాక్టరేట్ లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివిఎస్.కుమార్ గురువారం తెలిపారు. హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'షేర్ హోల్డర్స్ ఎంగేజ్‌మెంట్ ఇన్ ఇండియన్ కంపెనీస్ : స్టడీ ఆన్ కంపెనీస్ లిస్టెడ్ ఇన్ బిఎస్ఈ సెన్సెక్స్' అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివిఎస్.కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు ఆమెను అభినందించారు.

సంక్షేమ బోర్డును ప్రారంభించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు
- కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మిక సంఘం ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునః ప్రారంభించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు డిమాండ్ చేశారు. ఈ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. భవన నిర్మాణ కార్మిక సంఘం న్యూసిటీ నగర ఉపాధ్యక్షులు జి.ఏసు, ఓల్డ్ సిటీ నగర నాయకులు కె.రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి ఆర్.నరసింహులు, ఓల్డ్ సిటీ అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్, పెయింటర్స్ సంఘం జిల్లా కార్యదర్శి మాబాష, అధ్యక్షులు జాఫర్ హుస్సేన్ మాట్లాడారు. ఇసుక కొరత వల్ల, స్టీల్, సిమెంటు బిల్డింగ్ రంగానికి సంబంధించిన వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారన్నారు. సంక్షేమ బోర్డు నుంచి పక్కదారి పట్టించిన రూ.850 కోట్లను తిరిగి మళ్లించి కార్మికుల సంక్షేమానికి ఉపయోగించాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో నష్టపోయిన కార్మికులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం వెంటనే 1214 జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ కూడా పరిష్కరించాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నగర ఉపాధ్యక్షులు రమేష్ బాబు, బి.మద్దిలేటి, కె.సుధాకర్, జి.లక్ష్మన్న, కె.జానకి రామ్, వి.సుధాకర్, దావీదు, వెంకటరాముడు, రామాంజనేయులు, మాసన్న, పెయింటర్స్ సంఘం న్యూ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏసు, నరేంద్ర, కమిటీ సభ్యులు జీవరత్నం, పురుషోత్తం, మద్దిలేటి, హనుమంతు, రాజు, డేవిడ్ పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

క్లాప్ ఆటో డ్రైవర్లు జీతాలివ్వాలి

- సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి రాముడు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

క్లాప్ ఆటో డ్రైవర్ల పెండింగ్ జీతాలు ఇవ్వాలని, అగ్రిమెంట్ ప్రకారం రూ.18,500 జీతం ఇవ్వాలని సిపిఎం న్యూసిటీ కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం క్లాప్ ఆటోడ్రైవర్ల నాయకులు రాజేష్ అధ్యక్షతన కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయం ముందు మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. క్లాప్ ఆటో కార్మికులకు మద్దతుగా సిపిఎం సిటీ కార్యదర్శి రాముడు, ఎపి ఆటో అండ్ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు రవి, మెహమూద్, నగర ఉపాధ్యక్షులు కుమార్ పాల్గొని మాట్లాడారు. నగరంలో చెత్త లేకుండా శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న క్లాప్ డ్రైవర్లకు 6 నెలల నుంచి 12 నెలలుగా జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. అగ్రిమెంట్ ప్రకారం జీతం, ఈఎస్ఐ, పిఎఫ్ కట్టిన బిల్లులు కమిషనర్‌కు అప్పగించిన తర్వాతనే కమిషనర్ బిల్లులు మంజూరు చేయాలని తెలిపారు. అవేమీ అడగకుండానే దాదాపు రూ.7 కోట్లు ఏజెన్సీలకు బిల్లులు మంజూరు చేసి డబ్బులు అప్పగించారని చెప్పారు. కార్మికులకు అగ్రిమెంట్ ప్రకారం, సక్రమంగా జీతాలు ఇవ్వకపోయినా, కార్మిక చట్టాలను అమలు చేయకపోయినా ఏజెన్సీలపై చర్యలు తీసుకోకుండా, జీతాలు అడిగిన 17 మంది కార్మికులను విధుల నుంచి తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ భయభ్రాంతులకు గురి చేయడం బాధాకరమన్నారు. రఘు, శేఖర్, మద్దిలేటి, కృష్ణ, పరమేష్, షేక్షావలీ, రవి, శీను, దశరథ్ పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రాముడు

వంటావార్పుతో నిరసన

- 9వ రోజూ సమగ్ర శిక్షణ ఉద్యోగుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరవధిక సమ్మె తొమ్మిదో రోజు కొనసాగింది. వంట వార్పు ద్వారా వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సమ్మెకు డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రామన్న, వెల్దుర్తి ఎంఇఓలు మద్దతు తెలిపి మాట్లాడారు. వారు మాట్లాడుతూ ఎస్ఎస్ఎ ఉద్యోగులు న్యాయమైన డిమాండ్ల కొరకు పోరాడుతున్నారని, ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని ఉద్యోగుల నాయకులతో చర్చలు చేసి పరిష్కరించాలని లేదంటే సామాజిక సంఘాలతో ఐక్యంగా నిలబడి పోరాడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యాశాఖలో ప్రతి రిపోర్టు ఉన్నతాధికారులకు అందించడంలో కీలక పాత్ర వహిస్తున్నారని, పర్మినెంట్ ఉద్యోగుల కంటే ఎక్కువ శ్రమ చేస్తున్నారని ప్రభుత్వం వెట్టి చాకిరికి గురి చేస్తోందని, అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎస్-ఎస్ఎ ఉద్యోగుల జిల్లా సంఘం నాయకులు పుల్లయ్య, భాస్కర, వెంకట్ రాముడు, రమణ మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నతాధికారుల నుండి సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ఎస్ఓల పైన ఒత్తడి తెచ్చి ఉద్యోగులందర్నీ తొలగిస్తామని షోకాజు నోటీసులు ఇచ్చి బెదిరింపులకు దిగుతున్నారని, ఇటువంటి కుట్రలకు అధికారులు పాల్పడవద్దన్నారు. ఎస్ఎస్ఎ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జె.నాగేశ్వరరావు సంఘం జిల్లా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యేలకు, ఎంపీలకు మంత్రులకు వినతి పత్రాలు సమర్పిస్తున్నామని, ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. భవిష్యత్తులో వినూత్నమైన పోరాటాలు జరుగుతాయని అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే నియోజకవర్గం, మండల కేంద్రాల్లో పోరాటాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

వంటావార్పు నిర్వహిస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

కరువు మండలంగా ప్రకటించాలని
4న ఆర్‌డిఒ కార్యాలయానికి తాళాలు

- అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి - తుగ్గలి

తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ జనవరి 4న పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయానికి తాళాలు వేసి, పట్టణంలోని నాలుగు స్తంభాల వద్ద రోడ్లను దిగ్బంధిస్తున్నట్లు సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ జడ్‌పి కో ఆప్షన్ సభ్యులు నబి రసూల్, సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు, టిడిపి మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు తెలిపారు. గురువారం తుగ్గలి తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో వారు విలేకరులతో మాట్లాడారు. తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. తుగ్గలిలో ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేసి, రోడ్లను దిగ్బంధించి, కేంద్ర కరువు పరిశీలన బృందాన్ని ముట్టడించి, అనేక ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. అందుకే రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పత్తికొండలోనే ఆర్‌డిఒ కార్యాలయానికి తాళాలు వేసి ఆందోళనలు చేపడతామని చెప్పారు. మండలంలోని రైతులందరూ పార్టీలకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మాజీ ఎంపిటిసి వల్లే వెంకటేష్, టిడిపి నాయకులు బెస్త కృష్ణయ్య, మామలకుంట సలేంద్రం, ఎల్లప్ప యాదవ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సర్వమతాల సమ్మేళనం భారతదేశం

- ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ
- క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

సర్వమతాల సమ్మేళనం భారతదేశమని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు. గురువారం నగరంలోని బుధవార పేటలో ఉన్న చర్చిలో క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా క్రైస్తవ పేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం తనకు ఆనందాన్ని కలిగిస్తోందని తెలిపారు. ఏ దేశంలో లేనివిధంగా భిన్న మతాలు, భిన్న సంస్కృతులు మన దేశంలో ఉన్నాయని చెప్పారు. ఎవరే మతంలో ఉన్నప్పటికీ ఇతరుల మతాన్ని గౌరవించడం నేర్చుకోవాలని కోరారు. క్రైస్తవులు క్రిస్మస్ పండగతో పాటు నూతన సంవత్సరం వరకు పండగ వాతావరణంలో జీవిస్తారని, అందుకే వారికి చీరలు పంపిణీ చేశామని తెలిపారు. ప్రతి ఒక్కరూ సంపాదనలో కొంత భాగాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించాలని తెలిపారు. పావని, ఉషారాణి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు చేయాలి

- విఆర్‌ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

తెలంగాణ తరహాలో విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలని విఆర్‌ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంజి డిమాండ్ చేశారు. ఎపి విఆర్‌ఎల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య అధ్యక్షతన గురువారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విఆర్‌ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి.అంజి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు, జిల్లా సీనియర్ నాయకులు రామాంజనేయులు మాట్లాడారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విఆర్‌ఎలకు రూ.6500 నుంచి 10,500 వరకు జీతం పెంచారన్నారు. టిఎ రూ.50 నుంచి 100 పెంచారని, డిఎ రూ.100 నుంచి 300 పెంచారని చెప్పారు. ఇంటర్మీడియట్ క్వాలిఫికేషన్ మీద గ్రేడ్ వన్ ప్రమోషన్ ఇచ్చి 45 రోజులు సర్వే ట్రైనింగ్ ఇచ్చే వారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక టిఎ, డిఎలు తొలగించి ఒక్కో విఆర్‌ఎతో రూ.19,200 రికవరీ చేసినట్లు చెప్పారు. రికవరీ కట్టని మండలాలకు ట్రెజరీ అధికారులు 4, 5 నెలలున్నా జీతాలు పెట్టకుండా వేధించిన రోజులు ఉన్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో రూ.1.54 కోట్లకుపై ట్రెజరీ అధికారులు కట్టించుకున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక గ్రేడ్-2 విఆర్ఒ, సిపిటి ఎగ్జామ్ పాస్ కావాలని, డిగ్రీ అర్హత ఉండాలని అనేక షరతులు పెడుతున్నారన్నారు. విఆర్‌ఎలకు పేస్కేలు అమలు చేయాలని, 55 సంవత్సరాలు పైబడిన వారింట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. జిల్లా నాయకులు రమేష్, ప్రహ్లాద, దాము, మాధవ్, కృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అంజిబాబు

విఆర్‌ఎల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలోని కార్మిక, కర్షక భవన్లో జరిగిన సమావేశంలో విఆర్‌ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంజి ఆధ్వర్యంలో గురువారం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా టి.రమేష్, కార్యదర్శిగా కె.శ్రీనివాసులు, కోశాధికారిగా ధనుంజయ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రహ్లాద, ఉపాధ్యక్షులుగా మల్లయ్య, చిట్యాల మాధవ కృష్ణ, గోనెగండ్ల హనుమంతు, కర్నూలు గోపాల్, వెల్దుర్తి అయ్యస్వామి, కోసిగి రాజు, ఆలూరు అశోక్, మద్దికెర దామోదర్, చిప్పగిరి చంద్ర, పత్తికొండ శేఖర్, ఆస్పరి నరసింహతో పాటు 27 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిఐటియు సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు హాజరై మాట్లాడారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు.

మాట్లాడుతున్న అంజిబాబు

సతాయించిన సర్వర్

- సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో ప్రజలు పడిగాపులు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా సబ్ రిజిస్టర్ కార్యాలయావరణలో ఉన్న కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో గురువారం సర్వర్ సమస్యతో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు మందగించాయి. సర్వర్ మొరాయించడంతో రిజిస్ట్రేషన్ కార్యకలాపాల కోసం వచ్చిన ప్రజలు పడిగాపులుకాయాల్సి వచ్చింది. రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు 9 గంటలకే కార్యాలయం వద్దకు వచ్చి చేరుకుని ఎదురు చూశారు. సర్వర్ మొరాయించడంతో చంటి బిడ్డలతో వచ్చిన మహిళలు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయాన్నే కార్యాలయానికి వచ్చిన సాయంత్రం అయినప్పటికీ కూడా పనులు కాకపోవడంతో నిరాశకు గురయ్యారు. ఇదే విషయాన్ని జిల్లా రిజిస్ట్రార్ సిహెచ్ నాగలింగేశ్వరరావును వివరణ కోరగా ప్రభుత్వం కొత్త సర్వర్‌ను ఏర్పాటు చేశారని, అందువల్ల కొన్ని చిన్న చిన్న సమస్యలు ఎదురవుతుంటాయని, వాటిని సరి చేయడానికి టెక్నికల్ సిబ్బంది ఉన్నారని వెంటనే సరి చేస్తామని తెలిపారు.

సెన్సార్ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తొలగించాలి

- పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలో అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్, సెన్సార్ కెమెరాలను తొలగించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఈ.పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఎం.నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి, సంఘం సభ్యులు ఎస్.నౌషాద్, కె.మధుసూదన్ మాట్లాడారు. నగరంలో రోడ్ల విస్తరణ చేపట్టకుండా కూడళ్లలో ఎడమ వైపు (లెఫ్ట్ ఫ్రీ) ఆటంకం లేకుండా సెన్సార్ కెమెరాలను పెట్టి ప్రభుత్వానికి ఆదాయం కోసమే జరిమానాలు వేస్తున్నట్లుగా కనిపిస్తోందన్నారు. విజయ్ కుమార్ ఆటో పై 11, ఒక కుటుంబంలోని రెండు ద్విచక్ర వాహనాలపై 15 జరిమానాలు ఈ మధ్యకాలంలో వేశారన్నారు. ట్రాఫిక్‌లో ఐదు, పది నిమిషాలు నిలబడి వాహనాలు వదిలే పొగతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. ఆనంద్ టాకీస్ బ్రిడ్జిల కింద హంద్రీలో మరో రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తగా ఏర్పాటు చేసిన సెన్సార్ కెమెరాలు, వాటి ద్వారా పడిన జరిమానాలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్.మహబూబ్ బాషా, కె.శ్రీనివాసులు, సివి.రమణ, ఎం.యాకోబు, శశికుమార్ రెడ్డి, ఎస్ఎస్.రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పుల్లారెడ్డి

గుండెపోటు బాధితులకు అందుబాటులో ఇంజెక్షన్

- డాక్టర్ కల్పన

ప్రజాశక్తి- పత్తికొండ

గుండెపోటు బాధితులకు తెనెక్టెప్లస్ 40ఎంజి ఇంజక్షన్ అందుబాటులో ఉందని పత్తికొండ ప్రభుత్వ గైనకాలజిస్ట్ డాక్టర్ కల్పన అన్నారు. గురువారం ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన మనిషికి కొంత సేపు ఉపశమనం కోసం ప్రభుత్వాసుపత్రిలో తెనెక్టెప్లస్ ఇంజక్షన్ అందుబాటులో ఉందని అన్నారు. హొసూరు గ్రామానికి చెందిన రంగయ్య అనే వ్యక్తికి గుండెపోటు రావడంతో తెనెక్టెప్లస్ ఇంజక్షన్ వేశామని తెలిపారు. ఇంజక్షన్ వేయడం వల్ల రోగికి నాలుగు గంటలు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని అన్నారు. రూ.40 వేల విలువ చేసే జంక్షన్ పత్తికొండ ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులో ఉందని తెలిపారు. పట్టణ గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేద మహిళకు ఇల్లు మంజూరు చేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం గార్గేపురానికి చెందిన విమలమ్మకు ప్రభుత్వం ద్వారా పక్కా ఇంటిని మంజూరు చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జెరదొడ్డి సుధాకర్ హౌసింగ్ పీడీ ఎం.సిద్ధలింగమూర్తిని కోరారు. గురువారం ఆయన బాధితులు విమలమ్మ కుటుంబ సభ్యులతో పీడీని స్వయంగా కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2016లో విమలమ్మకు చెందిన గుడిసె గ్యాస్ సిలిండర్ పేలి అగ్నిప్రమాదంలో కాలి బూడిదయిందన్నారు. అప్పటి నుంచి విమలమ్మ సొంతింటి నిర్మాణం కోసం హౌసింగ్ అధికారులు చుట్టూ తిరుగుతున్నారని, సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ఆమెకు వెంటనే సొంతిల్లు మంజూరు చేసి ఆదుకోవాలని వివరించారు. పీడీ స్పందిస్తూ... తక్షణమే ఆమెకు ఇంటి మంజూరు కోసం చర్యలు చేపడతామని తెలిపారు.

పీడీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

సమస్యలు తెలుసుకునేందుకే 'గడపగడపకు'

- వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ జయ మనోజ్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే 'గడపగడపకు మన ప్రభుత్వం' చేపడుతున్నట్లు వైసిపి ఇన్‌ఛార్జీ జయ మనోజ్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని 5వ వార్డులో వార్డు కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. విజయనగర్ కాలనీలో జయమనోజ్ రెడ్డి, గౌతమ్ రెడ్డి, హిరణ్యంరెడ్డిలు ప్రతి గడపకూ తిరుగుతూ వార్డు సమస్యలు తెలుసుకుంటూ అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా జయమనోజ్ రెడ్డి మాట్లాడారు. ఆదోనిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డిని గెలిపించాలని కోరారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఆనంద్, రేణుక, మంజుల, శ్రీలక్ష్మి, సునీత రెడ్డి, కామాక్షి తిమ్మప్ప, అశోక్, సన్ని, శ్రీనివాస్ రెడ్డి, తాయన్న, ఫయాజ్, ప్రసాద్, రామకృష్ణారెడ్డి, తిక్కన్న, తిమ్మారెడ్డి, చిన్న, శంకర్ బాబు, దినేష్, ప్రణీత్, రీతు సింగ్, మల్లి, చిరంజీవి, ఈశ్వర్, లేబర్ కింగ్ నాగరాజు ఉన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న జయ మనోజ్ రెడ్డి

ప్రజా సేవలోనే ఆనందం

- ఎమ్మెల్యే కుమార్తె ప్రియాంక రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజా సేవలోనే రాంపురం రెడ్డి సోదరులకు ఆనందాన్ని కలిగిస్తోందని, అందుకే రాజకీయం ద్వారా ప్రజల సంక్షేమానికి కృషి చేస్తారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుమార్తె ప్రియాంక రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక రామచంద్ర నగర్ కాలనీలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్ లెట్‌ను అందజేసి పథకాల వివరాలను చదివి వినిపిస్తూ కాలనీ వాసులు తెలిపిన సమస్యలను విన్నారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పలు చోట్ల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వైసిపి మండలాధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, ఎస్‌వి వేణు గోపాల్ రాజ్, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, సచివాలయ కో కన్వీనర్ రాఘవేంద్ర ఆచారి, ఉప సర్పంచి హోటల్ పరమేష్, ఎంపిటిసి వెంకటేష్ శెట్టి పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ప్రియాంక రెడ్డి

ప్రజల పక్షాన నిలిచే పత్రిక.. ప్రజాశక్తి...

- శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజల సమస్యలే అజెండాగా వార్తలు రాసి ప్రజల పక్షాన నిలిచే పత్రిక 'ప్రజాశక్తి' దినపత్రిక అని శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు పేర్కొన్నారు. గురువారం శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో ప్రజాశక్తి 2024 సంవత్సర నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉన్నది ఉన్నట్లుగా, ప్రజల సమస్యలను నిర్భయంగా రాసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో నడిచి రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమం గురించి ప్రస్తావిస్తున్న ఈ పత్రికను అందరూ ఆదరించాలని కోరారు. ప్రజాశక్తి దినపత్రికకు శ్రీమఠం నుంచి ఎప్పుడూ ఆదరణ ఉంటుందని పేర్కొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పీఠాధిపతులు

క్రీడలతో ఆరోగ్యం మెరుగు : ఇఒఆర్‌డి

ప్రజాశక్తి - చిప్పగిరి

మనకు ఇష్టమైన ఏదో ఒక క్రీడ అలవాటు చేసుకుంటే, వాటి వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఇఒఆర్‌డి టి.బాలన్న తెలిపారు. గురువారం మండలంలోని నేమకల్లు గ్రామంలో 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో భాగంగా క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులనుద్దేశించి ఆయన మాట్లాడారు. చదువుతున్న సమయంలో క్రీడలపై మక్కువ చూపిస్తామన్నారు. ఆ అలవాటును మరిచిపోకుండా ఆడుతుండడం వల్ల శరీర సౌష్టవం కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతకు క్రీడలపై ఎంతో ఇష్టం ఉంటుందని, ప్రభుత్వం గ్రహించి 'ఆడుదాం ఆంధ్ర' నిర్వహిస్తోందని తెలిపారు. మహిళ సంరక్షకులు పావని, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లక్ష్మి పాల్గొన్నారు.

తుగ్గలి : 'ఆడుదాం ఆంధ్ర' క్రికెట్ పోటీల్లో బాట తండా టీం విజేతగా నిలిచింది. ఉప్పర్లపల్లి గ్రామ సచివాలయంలో జరిగిన క్రికెట్ పోటీల్లో బాట తండా యువకులు పాల్గొని ప్రతిభ కనబరచడంతో విజేతగా నిలిచారు. బాట తండా టీంను సర్పంచి బాలమ్మ, సర్పంచి సలహాదారుడు రాము నాయక్ అభినందించారు. అలాగే ఎమ్మెల్యే శ్రీదేవి క్రీడ అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు.

మున్సిపల్ కార్యాలయం ముందు

అంగన్వాడీల ధర్నా

- కేంద్రాలను సచివాలయ సిబ్బంది, పొదుపు మహిళలతో పని చేయడం మానుకోవాలని హితవు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయం ముందు గురువారం ధర్నా చేపట్టారు. పట్టణంలో, గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ కేంద్రాలను సచివాలయ సిబ్బంది, పొదుపు మహిళల ద్వారా నడిపించాలని చూడడం మానుకోవాలని తెలిపారు. పట్టణంలో అంగన్వాడీ కేంద్రాలకు సచివాలయ సిబ్బందిని, పొదుపు సంఘాల మహిళలను పని చేయడానికి నిలిపివేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాకు అంగన్వాడీ యూనియన్ నాయకులు గోవర్ధనమ్మ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు గోవిందు, రాముడు, హనుమంతు, తిమ్మ గురుడు, రాజు మాట్లాడారు. 17 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం దారుణమని తెలిపారు. ఇప్పటికి నాలుగు సార్లు చర్చకు పిలిచిన మంత్రులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు శైలజ, తులసి, నిర్మల, భాను, సునీత, గౌసియా, గ్రేసమ్మ, లత, మేరీ, సుమిత్ర, బండా లత, జయమ్మ, పార్వతి, శంషాద్ భాను, రాగమ్మ, 500 మంది అంగన్వాడీలు పాల్గొన్నారు. **ఆదోని**లోని అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా వెళ్లి పోస్టాఫీసు ముందు ధర్నా చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, సిఐటియు పట్టణ అధ్యక్షులు తిప్పన్న, సహాయ కారదర్శి లక్ష్మన్న, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, ఎఐటియుసి పట్టణ నాయకులు టి.వీరేష్, విజయ్ మాట్లాడారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు జీతాలు పెంచి సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, ప్రాజెక్టు యూనియన్ నాయకులు వరలక్ష్మి, సరోజ, జానకి హెచ్చరించారు. అంగన్వాడీలు పద్మ, రేణుక, సరోజ, సోమక్క, గీత, వీరమ్మ, మీనా కుమారి, రిజ్వానా, శారద, ఈరమ్మ పాల్గొన్నారు. **దేవనకొండ** తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి జ్యోతిలక్ష్మి అధ్యక్షతన ధర్నా చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి అశోక్ మాట్లాడారు. అంగన్వాడీలు ఎర్రమ్మ, హుస్సేనమ్మ, మమత, జానకి, సరోజ, వెంకటలక్ష్మి, మంగమ్మ, లక్ష్మి, భార్గవి, మాబున్నీ పాల్గొన్నారు. **మంత్రాలయం** ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 17వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీల సమస్యలను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ద్వారా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని వైసిపి యువనేత ప్రదీప్ రెడ్డికి అంగన్వాడీలు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మంత్రాలయం, కోసిగి మండలాల కార్యదర్శులు హెచ్.జయరాజు, కె.రాముడు మాట్లాడారు. అనంతరం భారీ ర్యాలీతో బయల్దేరి అంబేద్కర్ సర్కిల్ వద్ద అంగన్వాడీలు మోకాళ్లపై మానవహారం ఏర్పడి నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు అంజి, మంత్రాలయం ప్రాజెక్టు నాయకులు హెప్సిబా, విశాలాక్షి, లూసమ్మ, భీమేశ్వరి, ప్రమీల, ఫాతిమా, సుజాత, ద్రాక్షాయని, లావణ్య, కల్యాణి, రాధమ్మ, రంగమ్మ, సుజాత, రజియా, జయమ్మ పాల్గొన్నారు. **ఆలూరు**లో అంబేద్కర్ సాక్షిగా రోడ్డుపై కూర్చొని అన్నం తింటూ నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, అంగన్వాడీ యూనియన్ తాలుకా కార్యదర్శి జయశ్రీ, సిఐటియు నాయకులు షాకీర్, కృష్ణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు భారతి, బాలరంగమ్మ, లక్ష్మీ, సరస్వతి, సుజాత, ప్రభావతి, పుష్పవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీలు

ఆదోనిలో పోస్టు కార్డు ఉద్యమం చేపట్టిన అంగన్వాడీలు

దేవనకొండలో వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

మంత్రాలయంలో వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

ఆలూరులో...

వైసిపిలో ఎమ్మెల్సీ స్థానం ఏమిటో అందరికీ తెలుసు

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ స్థానం వైసిపిలో ఏమిటో అందరికీ తెలుసని, ఉనికి కోసం టిడిపిపై విమర్శలు చేయడం మానుకోవాలని టిడిపి నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ హితవు పలికారు. గురువారం ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేరుకే బడుగు, బలహీన వర్గాలకు పదవులని, పెత్తనం మొత్తం అగ్రవర్ణాలదేనని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల కోసం అమలు చేసే మేనిఫెస్టోను వైసిపి కాపీ కొడుతోందని విమర్శించారు. నవరత్నాలను కాపీ కొడుతున్నారని మళ్లీ టిడిపినే విమర్శించడం ఏమిటని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డిని ప్రశ్నించారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను పేరు మార్చి నవరత్నాలుగా ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్నారని, కేవలం అమ్మబడి మాత్రమే కొత్త పథకమని, దాంట్లో కూడా ఇచ్చిన హామీని నెరవేర్చలేదని విమర్శించారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని జగన్ కాపీ కొట్టి జనవరి నుంచి అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. జగన్ ప్రభుత్వానికి దమ్ముంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ

'రజకుల అభివృద్ధికి పాటుపడని ప్రభుత్వాలు'

ప్రజాశక్తి - హోళగుంద

రజకుల అభివృద్ధికి పాటుపడని ప్రభుత్వాలను గద్దె దింపాలని రజక సంఘం నాయకులు కోరారు. గురువారం వారు మాట్లాడారు. 2024లో రజకులందరూ ఏకతాటిపై తెచ్చి రజకుల సమస్యను పరిష్కరించే పార్టీకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. బీసీ జనాభాల్లో రెండో స్థానంలో ఉన్న రజకులను ఎన్నికల సమయంలో రజకులకు దోభీఘాట్లు, స్థలాలు, ఎస్సీ జాబితాలో చేరుస్తామని మాయమాటలు చెప్పి ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుని వదిలేస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీలూ రజక రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. తాలూకా ఉపాధ్యక్షులు రజక రామలింగ, తాలూకా ప్రధాన కార్యదర్శి రజక మహేష్, తాలూకా కార్యవర్గ సభ్యుడు రజక పులిగన్న పాల్గొన్నారు.

నమ్మక ద్రోహి జగన్మోహన్ రెడ్డి

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తానని నమ్మించి అధికారంలో వచ్చిన తర్వాత ద్రోహం చేశారని టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు విమర్శించారు. గురువారం ఆయన ఆదోనిలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఓట్లేసిన పులివెందుల ప్రజలకు నమ్మక ద్రోహం చేశారని, ఎత్తుకొని పెంచిన చిన్నాన్నను చంపిన నేరస్తులను కాపాడుతున్నారని విమర్శించారు. కడప ప్రజలను స్టీల్ ప్లాంట్ పేరుతో మోసం చేశారన్నారు. అన్నమయ్య డ్యాం బాధితులను నట్టేట ముంచారన్నారు. తల్లికి, చెల్లికి ద్రోహం చేశారని తెలిపారు. నమ్మిన ఎమ్మెల్యేలకు ద్రోహం చేశారన్నారు. నమ్మి ఓట్లేసిన దళితులు, మైనారిటీలకు ద్రోహం చేసి సిటిజెన్ బిల్లుకు పార్లమెంటులో మద్దతు తెలిపారని విమర్శించారు. మద్య నిషేధమని మహిళలను మోసం చేశారని, మద్యం ఆదాయాన్ని బ్యాంకులకు తాకట్టు పెట్టి నాసిరకం మద్యంతో మనుసుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. సిపిఎస్ రద్దు పేరుతో ఉద్యోగులను, జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను, అమరావతి రాజధానిని మార్చబోనని, విద్యుత్ చార్జీలను పెంచబోనని రాష్ట్ర ప్రజలను మోసం చేశారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి 120 సంక్షేమ పథకాలు రద్దు చేశారన్నారు. రాష్ట్రంలో 14 లక్షల ఎకరాల అసైన్‌మెంట్ భూములను కబ్జా చేశారని విమర్శించారు. 1.40 లక్షల బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా, సామాజిక న్యాయమని గొంతు కోశారన్నారు. ప్రశాంత్ కిశోర్ నమ్మకాన్ని కూడా కోల్పోయిన జగన్‌కు విశ్వసనీయత లేదని, జగన్ రెడ్డిని జనం నమ్మే పరిస్థితి లేదని తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- 3వ రోజూ మున్సిపల్ కార్మికుల సమ్మె

- జనసేన సీనియర్ నాయకులు శ్రీచల్లా వరుణ్ మద్దతు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జనసేన సీనియర్ నాయకులు శ్రీచల్లా వరుణ్, సిఐటియు డివిజన్ కార్యదర్శి రాముడు, ఐఎఫ్‌టియు డివిజన్ కార్యదర్శి ఎస్.రాజు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె మూడో రోజుకు చేరింది. జనసేన సీనియర్ నాయకులు శ్రీచల్లా వరుణ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కరోనా సమయంలో మున్సిపల్ కార్మికులు చేసిన సేవలు ఎనలేనివని తెలిపారు. పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేసి, డిమాండ్లను పరిష్కరిస్తానని పాదయాత్ర సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, గద్దెనెక్కిన తర్వాత విస్మరించారని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. అలాగే కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు, తాలూకా కార్యదర్శి ఆంథోని, డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు కరుణాకర్ మద్దతు తెలిపారు. మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు జై నాగరాజు, ఇస్మాయిల్, మునీంద్ర, లక్ష్మన్న, తిక్కయ్య, రాజు, పల్లవి రాజు, జనసేన జిల్లా ప్రోగ్రాం కమిటీ మెంబర్ నవీన్ కుమార్, జనసేన నాయకులు మున్నా, గోరంట్ల, పీర్‌వలీ, వినోద్, మహబూబ్, రమేష్, చంద్ర పాల్గొన్నారు. **ఆదోని**లోని పంపు హౌస్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణ అధ్యక్షులు తిప్పన్న పాల్గొన్నారు. **గూడూరు**లో మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె మూడో రోజుకు చేరింది. బస్టాండ్ సెంటర్‌లో మున్సిపల్ కార్మికులు ఏర్పాటు చేసిన సమ్మె శిబిరానికి మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు శాంతన్న అధ్యక్షత వహించారు. మున్సిపల్ కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్ మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు మనోహరమ్మ, గ్రేసమ్మ, లక్ష్మీదేవి, పద్మమ్మ, దానమన్న, సూర్య శేఖర్, శివయ్య, దుర్గ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో మద్దతు తెలుపుతున్న జనసేన సీనియర్ నాయకులు శ్రీచల్లా వరుణ్

ఆదోనిలో నిరసన చేపడుతున్న ఉద్యోగులు

జనవరి నుంచి రూ.3 వేల పింఛను

- జెసి నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జనవరి నుంచి వైఎస్ఆర్ పెన్షన్ కానుకను రూ.3 వేలకు పెంచినట్లు జెసి నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. గురువారం ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జెసితో పాటు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కంగాటి శ్రీదేవి, డాక్టర్ జె.సుధాకర్, వై.సాయిప్రసాద్ రెడ్డి, బాలనాగిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్, డిసిఎంఎస్ ఛైర్మన్ శిరోమణి మద్దయ్య, డిఆర్‌డిఎ పీడీ సలీమ్ బాష పాల్గొన్నారు. అనంతరం అధికారులతో జెసి మాట్లాడారు. జిల్లాలో వైఎస్ఆర్ పెన్షన్ కానుక, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా పథకాలను విజయవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకొని షెడ్యూల్‌ను రూపొందించుకోవాలన్నారు. జనవరి 1 నుంచి 8 వరకు వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జనవరి 23న వైఎస్ఆర్ ఆసరా, ఫిబ్రవరి 5న వైఎస్ఆర్ చేయూత పథకం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. చేయూత కింద 5 నుంచి 14 వరకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలోని ఎస్‌ఎపి క్యాంపు 2వ పటాలంలో కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగర పాలక ఉన్నత పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో గురువారం బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం డిసిపిఒ టి.శారద పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహ చట్టం-2006 గురించి తెలియజేస్తూ, 18 ఏళ్లలోపు వివాహాలు చేయడం వల్ల శారీరక, మానసిక సమస్యలు వస్తాయన్నారు. ఈ బాల్య వివాహాల వల్ల చిన్న వయస్సులో బాలికలు గర్భిణులు అయ్యి కాన్పు సమయంలో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేసి బాలికలను చదివించాలని కోరారు. జిల్లా ఛైల్డ్ హెల్ప్ లైన్ - 1098 కోఆర్డినేటర్ సుంకన్న, సోషల్ వర్కర్ ఎన్.నరసింహులు, శ్వేతా, రంగమ్మ, ఉపాధ్యాయులు ఆర్.గోపాల్ రెడ్డి, ఎం.సుగుణమ్మ, ఎం.హరిప్రసన్, డి.రూతమ్మ, ఎం.దేవేంద్రప్ప, ఎస్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి..

అభివృద్ధి చేసి చూపిస్తాం..!

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కా రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

రాబోయే ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వాలని, మంత్రాలయం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి కోరారు. గురువారం కౌతాళంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ముందుగా క్లస్టర్ ఇన్‌ఛార్జీలకు దిశానిర్దేశం చేశారు. మూడు నెలల్లో టిడిపి అధికారంలో వస్తుందని, పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం రోడ్డు షోగా వెళ్లి శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాలో పూజలు నిర్వహించారు. బయటగేరి, మాసలగేరిలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, మూడు సిలిండర్లు ఉచితం, ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.1500, రైతుకు రూ.20 వేలు అందించనున్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని మరిచిందన్నారు. వైసిపిని సాగనంపి టిడిపిని అధికారంలో తీసుకురావాలని కోరారు. చెన్నబసప్ప, అడివప్ప గౌడ్, వెంకటపతి రాజు, టిప్పు సుల్తాన్, నీలకంఠ రెడ్డి, రమేష్ గౌడ్, వెంకట్ రెడ్డి, కురుగోడు, రాజానందు, మంజు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తిక్కా రెడ్డి

ప్రజా ధనం దోచుకున్న సొమ్ముతో...

ఆస్తులు పెంచుకున్న ఎమ్మెల్యే

- టిడిపి మైనార్టీ నాయకులు ఉమ్మి సలీమ్

ప్రజాశక్తి - ఆదోని

ప్రజాధనం దోచుకుని ఆస్తులు పెంచుకున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని టిడిపి మైనార్టీ నాయకులు, వ్యాపారవేత్త ఉమ్మి సలీమ్ పేర్కొన్నారు. అభివృద్ధిలో ఆదోని ఎక్కడుందో అందరికీ తెలుసని, అవినీతి, అక్రమాలు చేయడంలో ఇక్కడి ఎమ్మెల్యే మొదటి స్థానంలో ఉన్నారని విమర్శించారు. గురువారం ఆదోనిలో ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో దోచుకున్న సొమ్ముతో ఆస్తులను పెంచుకున్నారే తప్ప అభివృద్ధి చేయలేదని, ఎమ్మెల్యే అక్రమాలపై ప్రశ్నించినందుకు తనపై, తన కుటుంబ సభ్యులపై, చివరకు తన తల్లిపై కూడా నాన్ బెయిలబుల్ కేసులు పెట్టారని తెలిపారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో సిఎండిఎఫ్, ఎంపీ నిధుల ద్వారా బోర్లు నామమాత్రంగా వేసి రూ.కోట్లు స్వాహా చేశారని విమర్శించారు. ఆర్‌టిఐ యాక్ట్ ద్వారా అందుకు సంబంధించిన సమాచారం పొంది ఆయా గ్రామాల్లో పరిశీలించి నిధుల స్వాహాను వెలుగులోకి తెస్తున్నట్లు తెలిపారు. ఒక్క గ్రామంలో నాలుగు నుంచి ఐదు చోట్ల బోర్లు వేశారని, ఒక్కో బోరు వేయడానికి రూ.రెండు లక్షల చొప్పున నిధులు డ్రా చేసుకొని ఇటు ఆదోని ఎమ్మెల్యే, అటు కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ స్వాహా చేశారని విమర్శించారు. ఆదోని మున్సిపాలిటీకి 20 ఏళ్లుగా ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలోనే ఉందని, అక్కడ అయన చెప్పిన వారే ఛైర్మన్‌గా కొనసాగారని తెలిపారు. అభివృద్ధి మాత్రం జరగలేదన్నారు. ఏడాదికి రూ.10 కోట్ల పన్నులు వసూలు చేస్తున్నా ఎక్కడ చూసినా రోడ్లు, మురుగునీటి కాలువలు సక్రమంగా లేవని, తాగునీరు మాత్రం కొన్ని ప్రాంతాల్లో వారానికోసారి, మరి కొన్ని ప్రాంతాల్లో నాలుగు రోజులకు ఒకసారి వస్తున్నాయని తెలిపారు. ఇదే ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి రూ.3 కోట్లే ఆదాయం ఉన్న రోజూ తాగునీరు వస్తున్నాయని, రోడ్లన్నీ అభివృద్ధి చెందాయని చెప్పారు. అక్కడ అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ సదుపాయం ఉందని, ప్రజలకు అన్ని సదుపాయాలు ఉన్నా ఆదోనిలో ఎందుకు లేదని ప్రశ్నించారు. తన ఇంటి పక్కనే ఎమ్మెల్యే ఇల్లు ఉందని, గతంలో ఒక ఇల్లు ఉన్న ఎమ్మెల్యే ఇప్పుడు మరో భవనం కొనుగోలు చేశారని తెలిపారు. అలాగే ఈ ప్రాంతంలో 50 సెంట్ల స్థలం ఉందని, అనేక వాహనాలు ఉన్నాయని, ఎమ్మెల్యే, ఆయన కుమారుడు బయల్దేరితే అనేక వాహనాల కాన్వాయ్ ఉంటుందని చెప్పారు. ఇది అభివృద్ధి కాదా అని ఆయన వ్యంగంగా నిలదీశారు. హిందూ శ్మశాన వాటికలోని దహన సంస్కారాల మిషన్ రూ.కోటి కొనుగోలు చేస్తే దానిని కూడా మాయం చేశారని, అనేక అక్రమాలు చేశారని విమర్శించారు. ఇక్కడ యువతకు ఉపాధి లేక దూర ప్రాంతాలకు వలస పోతున్నారని తెలిపారు. 20 ఏళ్లలో ఒక్కరికి కూడా ఎమ్మెల్యే ఉపాధి కల్పించలేదని, ఇలాంటి వారిని మళ్లీ ఎన్నుకోవాలా అని ప్రశ్నించారు. తను చెప్పింది అవాస్తవమని నిరూపిస్తే తాను ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోతానని, తమ సవాళ్లను ఎమ్మెల్యే స్వీకరిస్తారా అని నిలదీశారు. నాయకులు విజయ్, సమీర్, షేర్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సలీమ్

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

-18వ రోజు కొనసాగిన న్యాయవాదుల రిలే దీక్షలు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

ఎపి భూయాజమాన్య హక్కు చట్టం, జిఒ 512 వెంటనే రద్దు చేయాలని న్యాయవాదులు చేపట్టిన రిలే నిరహర దీక్షలు ధర్నా చౌక్‌లో 18వ రోజు కొనసాగాయి. కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన కొనసాగించారు. ఈ దీక్షలు న్యాయవాదులు వసుంధర దేవి, శఖానా, సమీరా షాహిన్, సరోజ క్రిష్ణా, మురళీమోహన్, శివ ప్రసాద్, రేవతి, వీరా ప్రియాంక, బాషా ఖాద్రీ, అబ్దుల్ హుసేన్ కూర్చున్నారు. ఈ దీక్షలకు కాంగ్రెస్ నాయకులు కరుణాకర్ తమ సంపూర్ణ మద్దతు తెలిపి మాట్లాడారు. బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగభూషణం నాయుడు, కార్యదర్శి చక్రపాణి, నాయకులు రవి కుమార్, అబ్దుల్ రావుఫ్, ఓంకార్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

వైభవంగా పూల రథోత్సవం

హాలహర్వి : మండలంలో ప్రసిద్ధిగాంచిన గూళ్యం గ్రామంలోని శ్రీశరణ గాదిలింగేశ్వర స్వామి పూల రథోత్సవం గురువారం వైభవంగా సాగింది. ఆలయంలో విశేష పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. పురోహితులు వేకువజాము నుంచే స్వామి వారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అర్చనలు, అభిషేకాలు చేశారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసింది. రాత్రి 7.30 గంటలకు రథోత్సవాన్ని ప్రారంభించారు.

జగనన్న కాలనీలో గృహ ప్రవేశం

- వైసిపి ప్రముఖులకు సన్మానం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వం నుంచి మంజూరైన ఎమ్మిగనూరు రహదారిలో ఉన్న జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన ఇంటిని వైసిపి యువనేత వై.ప్రదీప్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రచ్చుమర్రి మల్లేష్ నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశ ఆహ్వానం అందుకున్న ఆయన గురువారం గృహ ప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఆయనకు మల్లేష్ శాలువా, గజమాల వేసి సన్మానించారు. గడపగడపకు తిరుగుతున్న సమయంలో మల్లేష్ ఆహ్వానం అందుకున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కుమార్తె ప్రియాంక రెడ్డి, వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛారీర్జీ విశ్వనాథ్ రెడ్డి, రోగప్ప, రవి రెడ్డి, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి జి.వెంకటేష్, జనార్ధన్ రెడ్డి, బొంబాయి శివ, వీరారెడ్డి గృహ ప్రవేశ వేడుకకు హాజరయ్యారు. వారికి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు.

ప్రదీప్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు బీవీ అడ్డా : టిడిపి

ప్రజాశక్తి - నందవరం

2024 శాసన సభ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి భారీ మెజార్టీతో గెలవబోతున్నారని, ఎప్పటికైనా ఎమ్మిగనూరు బీవీ అడ్డా అని ఎంపిటిసి బోయ వెంకటేశ్వరమ్మ, తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షులు మిట్టా సోమాపురం వీరేష్ తెలిపారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో 2024 ఎన్నికల్లో వైసిపి నుంచి ఎవరు పోటీలో నిలబడినా వారిపై బీవీ భారీ మెజార్టీతో గెలవబోతున్నారని జోష్యం చెప్పారు. ఎమ్మిగనూరును అభివృద్ధి చేసింది కేవలం బీవీ.మోహన్ రెడ్డి కుటుంబమేనని, బీవీ.మోహన్ రెడ్డి రుణం తీర్చుకోవడానికి మరోసారి ఎమ్మిగనూరు ప్రజలకు అవకాశం వచ్చిందని తెలిపారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలు సాగునీటితో సస్యశ్యామలం కావాలని, ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణం కోసం బీవీ ఒక్కరే పట్టు పట్టి రూ.1900 కోట్లను ఆర్‌డిఎస్‌కు మంజూరు చేయించారని చెప్పారు. ఆర్‌డిఎస్ నిర్మాణం పూర్తి కావాలంటే మరోసారి బీవీని ఎమ్మెల్యేను చేయాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి టిడిపి, బీవీ కుటుంబం ఎంతో కృషి చేసిందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి బీవీ.జయ నాగేశ్వర రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి, మంత్రిని చేయాలని కోరారు. టిడిపి నాయకులు లింగన్న, రామలింగడు, బొజ్జన్న, ఉరుకుంద గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

బీవీని కలిసిన మిట్టా సోమాపురం నాయకులు

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓఎస్ నెం.411/2022

శెట్లెం శ్రీనివాసరావు ..... వాది

ఎదిరి

శెట్లెం క్రిష్ణమూర్తి మరియు యితరులు..ప్రతివాదులు

టు,

6వ ప్రతివాది

శెట్లెం నర్మద, తండ్రి ఎస్.చిన్నరంగయ్య,
భర్త రాజారామ్, వయస్సు:56సం॥ హిందూ,
గృహిణి, డోర్ నెం.87-1403-50,
మారుతి మెగా సిటి(సౌత్),
నంద్యాల రోడ్డు, కర్నూల్ టౌన్ మరియు జిల్లా.

పై నెంబరు దావాలో వాది, ప్రతివాదులపైన భాగపంపిణీ పరిహారం పొందగోరి దావాను దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో 6వ ప్రతివాదికి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తేది:29-12-2023వ తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు సదరు దావాను విచారించి తీర్మానించ బడునని మీకు తెలియజేయడమైనది.

// శ్రీకోర్టు వారి అనుమతిన //

ఇట్లు

గిద్దలూరు **శ్రీ ఉదయగిరి మల్లికార్జునరావు**
తేది:23-12-2023 వాది పరం అడ్వకేటు.
సెల్ నెం.7396346499

ప్రజాశక్తి
శుక్రవారం 29 డిసెంబర్ 2023
5
నంద్యాల

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

అట్టహాసంగా నంది బాలోత్సవాలు ప్రారంభం

- పిల్లలకు ఈ ఉత్సవాలు ఎంతో దోహదపడుతాయి
- నంద్యాల వేదిక కావడం సంతోషంగా ఉంది
- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా
- జిల్లా నలుమూలల నుండి కదలి వచ్చిన విద్యార్థులు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, పాల్గొన ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తదితరులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్ హాల్‌లో నంది బాలోత్సవాలు గురువారం అట్ట హాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు బాబాన్, కార్డియాలాజిస్ట్ డాక్టర్ క్రాంతి చైతన్య, ఈఎన్‌టి స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీకాంత్, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు దస్తగిరి పర్ల, నంది బాలోత్సవం ఆహ్వాన సంఘం గౌరవ సలహాదారు బి.శంకరయ్య, అమరావతి బాలోత్సవం విజయవాడ కార్యదర్శి యూవి.రామరాజు, కర్నూలు బాలోత్సవం జిల్లా కార్యదర్శి జెఎన్ శేషయ్యలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమానికి నంది బాలోత్సవం ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి జి.నగేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నంది బాలోత్సవాలకు నంద్యాల జిల్లా కేంద్రం వేదిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బాలోత్సవాలు విద్యార్థులకు ఎంతో దోహద పడతాయని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా సామాజిక స్పృహ పెరుగుతుందని తెలిపారు. భవిష్యత్‌లో జరిగే కార్యక్రమాలకు తన సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు.

ఎమ్మెల్సీ మాట్లాడుతూ పిల్లలు చిన్నతనం నుండే మంచి అలవాట్లవైపు వెళ్ళినప్పుడే మంచి పౌరులుగా తయారవుతారన్నారు. ప్రస్తుతం పిల్లలు కేవలం చదువుకే పరిమితమవుతున్నారని, తద్వారా సమాజం పట్ల అవగాహన కోల్పోతున్నారని అన్నారు. నంది బాలోత్సవం పేరుతో పిల్లలలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడం, దారిలో ఉన్న స్కిల్‌ని బయటకు తీయడం ఎంతో అవసరమన్నారు. మొదటి రోజు క్లాసికల్ డాన్స్, నృత్యం, ఏకపాత్రాభినయం, వేషధారణలు, చిత్రలేఖనం, వ్యాసరచన, పాటలు, కూచిపూడి, జానపదం తదితర పోటీలలో వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంబానికి ముందు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిచే జెండాను, ఎమ్మెల్సీచే బాలోత్సవం జెండాను నిర్వాహకులు ఆవిష్కరింప జేయించారు. క్లాసికల్ నృత్యాన్ని ప్రగతి ఈఎన్‌టి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుండి విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నంది బాలోత్సవం ఆహ్వాన సంఘం కన్వీనర్ బి.రామరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.మౌలాలి, కోశాధికారి గురుస్వామి, సభ్యులు డి.క్రాంతి కుమార్, జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నాగరాజు, మాణిక్యం శెట్టి, ఉపాధ్యాయులు సుధాకర్, ప్రసాద్, గోపాల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శన చేస్తున్న బాలికలు

ఫిర్యాదులు, అభ్యంతరాలను క్లియర్ చేయండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు సంబంధించి స్వీకరించిన క్లెయిమ్స్, అభ్యంతరాలను వెంటనే క్లియర్ చేయాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ ఈఆర్‌ఓ, ఏఈఆర్వోలను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు, ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి ఆర్డీవోలు, అన్ని మండలాల తాసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు సంబంధించి పెండింగ్ వున్న ఫారం-6, 7, 8లో ఉన్న 924 దరఖాస్తులను నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఎన్నికల పాపులేషన్ రేషియో, జెండర్ రేషియో, జంక్ క్యారెక్టర్స్, 10 కంటే ఎక్కువ ఓట్లు వుండి పెండింగ్‌లో ఉన్న అంశాలపై కలెక్టర్ అడిగి తెలుసుకుంటూ ఆలస్యం కావడానికి గల కారణాలపై ప్రశ్నించారు. ఎన్నికల విధులలో నిర్లక్ష్యం పనికిరాదని, భారత ఎన్నికల సంఘం సూచించిన ఆదేశాలను తప్పక అనుసరిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నంద్యాల పట్టణంలో ఓటర్ల సవరణకు సంబంధించి అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రత్యేకంగా తీసుకొని ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటి సర్వేలో పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఓటర్ల జాబితాలో సవరించి స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి చేయాలన్నారు. 18, 19 సంవత్సరాల యువ ఓటర్ల నమోదుపై దృష్టి సారించి నమోదు చేయించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్డీవోలు శ్రీనివాసులు, ఎం.దాసు, వెంకటరెడ్డి, అన్ని నియోజకవర్గాల ఏఈఆర్వోలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

- జిల్లా వ్యవసాయ అధికారి టి.మోహన్ రావు

ప్రజాశక్తి - డోన్

రబీలో సాగుచేసిన పంటలకు రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి టి మోహన్ రావు తెలిపారు. గురువారం మండలంలోని ఉడుములపాడు గ్రామంలో రబీ పంట నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి టి మోహన్ రావు, వ్యవసాయ సహాయ సంచాలకులు అశోక్ వర్ధన్ రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట నమోదును త్వరగా పూర్తి చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫీ, ఉడుములపాడు గ్రామ వ్యవసాయ సహాయకులు ఆనంద్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

బ్యానర్లు కట్టడానికి వెళ్తూ

ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి - ప్యాపిలి

ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి సంబంధించిన బ్యానర్లు కట్టడానికి ఐచర్ వాహనంలో వెళుతూ జారి కింద పడి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. డోన్ పట్టణానికి చెందిన సిఐటియు ప్యాపిలి మండల కార్యదర్శి రహిమాన్ కుమారుడు లాల్ బాషా (26), బేతంచెర్లకు నీలకంఠం కుమారుడు సాయి శశాంక్ (17)తో పాటు మరో నలుగురు యువకులు కలిసి రాజకీయ నాయకుల బ్యానర్లు కట్టే పనులు చేస్తుంటారు. ఈ క్రమంలో మంత్రి బుగ్గన బ్యానర్లు కట్టడానికి 6 మంది యువకులు డోన్ నుంచి ఐచర్ వాహనంలో ప్యాపిలి మండలం పిఆర్ పల్లె మీదుగా జక్కసానికుంట్ల గ్రామానికి బయల్దేరారు. జక్కసాని కుంట్ల గ్రామ సమీపంలోకి వెళ్లగానే మలుపు దగ్గర ఐచర్ వాహనం తిరగడంతో వెనక భాగంలో కూర్చుని ఉన్న యువకులు కింద పడ్డారు. సాయి శశాంక్, లాల్‌బాషాల తలలకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా నలుగురికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సాయి శశాంక్, లాల్‌బాషాలను హుటాహుటిన వారిని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయి శశాంక్ (17) కోలుకోలేక మృతి చెందాడు. లాల్ బాషా పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు జలదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాల్ బాషా(ఫైల్)

మృతి చెందిన సాయి శశాంక్

పోస్టు కార్డులతో నిరసన

- సిఎంకు ఉత్తరాలు రాసి పోస్ట్ చేసిన అంగన్‌వాడీలు
- 17వ రోజు కొనసాగిన నిరవధిక సమ్మె
- బెదిరించాలని చూస్తే ప్రత్యక్ష కార్యాచరణే
- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల జిల్లాలో 17వ రోజు అంగన్‌వాడీలు తమ సమస్యలను పోస్ట్ కార్డుపై రాసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి పోస్ట్ చేసి నిరసన తెలిపారు. నంద్యాల, మహానంది, ఆత్మకూరు, నందికొట్కూరు, మిడుతూరు, కొత్తపల్లి, బేతంచెర్ల, చాగలమర్రి, రుద్రవరం, బనగానపల్లెలో పోస్టు కార్డులతో నిరసన తెలిపారు. పగిడ్యాలలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట పొర్లు దండాలు పెడుతూ నిరసన చేపట్టారు.

నంద్యాల కలెక్టరేట్ : అంగన్‌వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుండా సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు బెదిరించాలని చూస్తే ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకుంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ హెచ్చరించారు. గురువారం నంద్యాల తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన నిరసన దీక్ష శిబిరాన్ని మిగతా 6వ పేజీలో...

బేతంచెర్లలో ఉత్తరాలను పోస్ట్ బాక్స్‌లో వేస్తున్న అంగన్వాడీలు

నంద్యాలలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్

కాంగ్రెస్ పార్టీ కండువా వేస్తున్న బరగొడ్ల హుస్సేన్ బాషా

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా జరిగాయి. నంద్యాల పార్లమెంట్ కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు జె.లక్ష్మి నరసింహ యాదవ్ పిలుపు మేరకు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆళ్లగడ్డ మండల అధ్యక్షులు, సమన్వయకర్త బరగొడ్ల హుస్సేన్ బాషా ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు అన్ని విధాలుగా అండదండలుగా ఉన్న పార్టీ కాంగ్రెస్ అన్నారు. మొన్న కర్ణాటక, నిన్న తెలంగాణ రేపు ఆంధ్రప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. పార్టీ ఆవిష్కరణ దినోత్సవం సందర్భంగా ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామానికి చెందిన ఒక్కపెల్ల షరీఫ్ కాంగ్రెస్ పార్టీలో బరగొడ్ల హుస్సేన్ బాషా ఆధ్వర్యంలో చేరాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంధం మల్లేశ్వర్ రెడ్డి, పసుపులేటి లక్ష్మి నరసింహ, శ్రీనివాసులు, సోషల్ మీడియా జిల్లా కో ఆర్డినేటర్ వై.సంజీవ కుమార్, మహెబుబ్ బాషా, శేఖర్, అహమ్మద్ హుస్సేన్, హుస్సేన్ బాషా, దస్తగిరి, హరుణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

31, 1 తేదీలలో ఆర్జిత సేవలు, అభిషేకాలు, స్పర్శ దర్శనం నిలుపుదల

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని మల్లికార్జున స్వామికి ఈ నెల 31వ తేదీ ఆదివారం, జనవరి 1వ తేదీ సోమవారం వస్తున్న కారణంగా ఆర్జిత సేవలు, అభిషేకాలు, స్పర్శ దర్శనం నిలుపుదల చేస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెద్దిరాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆదివారం, సోమవారం పర్వదినాలను పురస్కరించుకుని భక్తుల రద్దీ అధికంగా ఉండడం కారణంగా సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. భక్తులందరికీ స్వామి అమ్మవారి అలంకార దర్శనం మాత్రమే కల్పించనున్నట్లు తెలిపారు. శీఘ్ర, అతి శీఘ్ర దర్శనం టికెట్లు రూ.150, రూ.300 టికెట్లను ఆన్లైన్లో బుక్ చేసుకోవాల్సిందిగా సూచించారు. ఆన్లైన్లో 30 శాతం, కరెంటు బుకింగ్ 70 శాతం టికెట్లను ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉచిత దర్శనం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని భక్తులు సంయమనం పాటించాలని సూచించారు.

జనావాసాల మధ్య ప్రభుత్వ మద్యం దుకాణం

- చుట్టుపక్కల ఆర్‌టిసి బస్టాండ్, ఆరోగ్య కేంద్రం

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, మహిళలు

ప్రజాశక్తి - ప్యాపిలి

ప్యాపిలి పట్టణంలో జనావాసాల మధ్య ప్రభుత్వ మద్యం దుకాణంను ఏర్పాటు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల ప్రకారం ఆలయాలకు, ప్రార్థనమందిరాలకు, పాఠశాలలకు, కళాశాలలకు వంద మీటర్ల దూరంలో, జాతీయ రహదారికి 220 మీటర్ల దూరం పాటించి మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలి. నివాస ప్రాంతాల మధ్య ఏర్పాటు చేయరాదు. కానీ ప్రభుత్వ అధికారులే నిబంధనలను గాలికొదిలి జనవాసాల మధ్య, ఆస్పత్రి, ఆర్‌టిసి బస్టాండ్, ప్రజల రాకపోకల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడం శోచనీయం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మద్యం దుకాణానికి 10 మీటర్ల దూరంలో బస్టాండ్ ఉంది. దీంతో వచ్చే పోయే ప్రయాణికులతో నిత్యం ఈ ప్రదేశం రద్దీగా ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు బస్టాండ్‌లో వేచి ఉంటుంటారు. జడ్పీ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెళ్లే విద్యార్థినిలు, విద్యార్థులు, సాయిబాబా గుడికి వెళ్లే భక్తులు కూడా ఈ దారి వెంట వెళ్తుంటారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు దగ్గరగా ఉంటాయి. ఎస్ఇబి అధికారులు జనావాసాల నడుమ మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో స్థానికులతో పాటు ప్రయాణికులు, విద్యార్థినీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి మద్యం దుకాణాన్ని ఎత్తివేసి పట్టణానికి దూరంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జనవాసాల మధ్య ఉన్న మద్యం షాపు

ప్రజాశక్తి నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ప్రజాశక్తి దినపత్రిక 2024 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా రాస్తూ ప్రజల పక్షాన నిలిచిన పత్రిక ప్రజాశక్తి అన్నారు. కార్మికులు, కర్షకులు ,ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం వార్తలు రాస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాశక్తి నంద్యాల డివిజన్ ఇన్చార్జి మల్లికార్జున, విలేకరులు జి.మద్దయ్య యాదవ్, కొలిమిగుండ్ల సురేష్ లింగాధర్, వైసిపి ముస్లిం మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్, వైసిపి మండల కన్వీనర్ సన్నల జనార్దన్ రెడ్డి, సంజామల మండల ఉపాధ్యక్షులు చిన్నబాబు, నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, సయ్యద్ సజ్జాత్ హుస్సేన్, వార్డు మెంబర్ సూరి, దేవుడు గౌడ్, ఇనూస్, గౌస్ పీరా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- పెండింగ్ వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

- జిల్లా పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే సమ్మెబాట తప్పదని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, జిల్లా నాయకులు రత్నమయ్య, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తిమ్మరాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం స్వచ్ఛభారత్ గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా గ్రామాలలో చెత్తను సేకరించి, మురికి కాలువల శుభ్రం చేసి ప్రజలను అంటురోగాల నుండి కాపాడి నిత్యం సేవలు చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్, 22 నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వచ్ఛభారత్ గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు ఇస్తానని వాగ్దానం చేసి ఐదు సంవత్సరాలు కావస్తున్న ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. కార్మికులకు టెండర్ విధానం రద్దు చేయాలని, అర్హులైన వారందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలన్నారు. కనీస వేతనాలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డిపిఒ మంజుల వాణికి వినతి అందజేశారు. సమస్యలను పరిష్కరిస్తామని ఆమె హామీనిచ్చారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికులు రంగస్వామి, నెట్టకల్లు దేవదాసు, ప్రసాదు, నాగన్న, త్యాగరాజు, సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

గుండెపోటుతో వైసిపి నాయకుడు మృతి

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాళి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని కైప గ్రామానికి చెందిన వైసిపి నాయకులు సాధుల సత్యనారాయణ రెడ్డి గుండెపోటుతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసీపీ ఆవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలు గ్రామానికి చేరుకుని నివాళులర్పించారు. తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే భరోసానిచ్చారు.

ఆడుదాం-ఆంధ్రకు విశేష స్పందన : చైర్మన్

ప్రజాశక్తి - డోన్

వైసిపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని డోన్ మునిసిపల్ ఛైర్మన్ సప్త శైల రాజేష్ అన్నారు. గురువారం డోన్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో ఖోఖో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడా సంబరాలు నిర్వహించడం సంతోషకరమని, గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసే ఈ పోటీలతో రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మండల విద్యాధికారి ప్రభాకర్, వైస్ ఛైర్మెన్‌లు, కౌన్సిలర్లు, వ్యాయమ ఉపాధ్యాయులు, మునిసిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మునిసిపల్ ఛైర్మన్

మాట్లాడుతున్న డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

16 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

- డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి - డోన్

డోన్ మున్సిపాల్టీ అభివృద్ధికి సంబంధించి 16 అంశాలకు మున్సిపల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. గురువారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.84 లక్షలతో నారాయణ స్కూల్ దగ్గర నుంచి కొత్తకు వెళ్లే ప్రధాన రహదారి వరకు రోడ్డు వేయడానికి తీర్మానించినట్లు తెలిపారు. పట్టణంలో పాతబడిన గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయుటకు, ఇన్నర్ వీల్ క్లబ్ కోసం నూతన భవనం నిర్మాణాలకు ఆమోదించారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు హరికిషన్, జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, డిఇ రసూల్, ఏఈ సురేష్, శానిటేషన్, రెవిన్యూ, హౌసింగ్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

ఉచితంగా ఎస్ఎస్‌సి మోడల్ పేపర్స్

ప్రజాశక్తి - సంజామల : ప్రతి హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు, సబ్జెక్టు టీచర్లకు ఉచితంగా మోడల్ పేపర్స్‌ను అందజేసినట్లు యుటిఎఫ్ నాయకులు బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. గురువారం ఎంఈఓ ఈశ్వరయ్య పదవ తరగతి మోడల్ పేపర్స్‌ను ఆవిష్కరించారు. ఎంఇఒ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ఈ మోడల్ పేపర్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండలాధ్యక్షురాలు అయేషా బేగం, ప్రధాన కార్యదర్శి మున్ని,నాయకులు వెంకటయ్య, నబి రసూల్, రాంపుల్లారెడ్డి, శేఖర్, వలి, అనురాధ, సూర్యనారాయణ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి యువజన మండలాధ్యక్షుడు షరీఫ్‌కు సన్మానం

ప్రజాశక్తి - చాగలమర్రి

వైసిపి యువజన మండల అధ్యక్షుడు వలిసా గారి పెయింటర్ మాబు షరీఫ్‌ను గురువారం షేక్ బాబూలాల్ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కొత్తపల్లి అబ్దుల్లా, వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు ముల్లా ఖాదర్బాషా, వలీసా గారి మహమ్మద్ , యామని ఖదీర్, సయ్యద్ భాష, పెయింటర్ రజాక్, బబ్లు, బావదీన్, జమాల్, మహబూబ్ సున్నా , సచివాలయాల కన్వీనర్ గౌస్ మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

షరీఫ్‌ను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

చెవిలో క్యాలీఫ్లవర్‌తో మున్సిపల్ కార్మికుల నిరసన

- మూడో రోజు కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ సమ్మెలో భాగంగా గురువారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చెవిలో క్యాలీఫ్లవర్లు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, కే.మహమ్మద్ గౌస్, కర్నూలు జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజులుగా జరుగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి హామీలను అమలు చేయకుండా మాటలు చెబుతూ, ప్రగల్బాలు పలుకుతూ కార్మికులందరికీ చెవిలో పూలు పెట్టడమే కాదు ఏకంగా పెద్ద క్యాలీఫ్లవర్లు పెడుతున్నారని విమర్శించారు. స్కిల్డ్, సెమి స్కిల్డ్, వేతనాలను జీవో నెంబర్ 7 ప్రకారం అర్హులైన వారందరికీ ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులందరికీ వర్తింపచేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. **ఆత్మకూరు :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం దగ్గర కార్మికులు నిరవదిక సమ్మెలో భాగంగా మూడో రోజు మోకాళ్ళపై నిలబడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, గొడుగురాజు, జోసెఫ్‌లు మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు ప్రజలందరికీ రోగాలు, వ్యాధులు రాకుండా ప్రతిరోజు పట్టణాన్ని శుభ్రం చేస్తూ, కరోనా లాంటి సమయంలోనూ విధులు నిర్వహించారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికలకు ముందు అసెంబ్లీలో, బయట పాదయాత్రలో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ అధికారంలోకి రాగానే 6 నెలలో పర్మినెంటు చేస్తానని, సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తానని, పర్మినెంట్ సిబ్బందికి సిపిఎస్ ను వారం రోజుల్లో రద్దు చేస్తానని హామీలు ఇచ్చారన్నారు. ఆయన అధికారంలోకి వచ్చి 5 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సురేంద్ర, ఇస్మాయిల్, గణపతి, మోహన్, మున్సిపల్ కార్మికులు సుగుణమ్మ, రూతమ్మ, జీవరత్నమ్మ, మణెమ్మ, కుమారి, సుశీలమ్మ, తిమయ్య, నాగన్న, మోహన్, సురేష్, దానమయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు. **డోన్ :** స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని దీక్ష శిబిరంలో మున్సిపల్ కార్మికులు చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం, మండల అధ్యక్షులు పి.రామాంజనేయులు, కోశాధికారి బి.నాగమద్దయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుల్లాయప్ప, ఉపాధ్యక్షులు పెద్ద ఎల్లయ్య మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షేభారాణి సంఘీభావం ప్రకటించారు. యేసు, హైమారావు, దేవదానం, మద్దయ్య, చంద్ర, రామాంజి, రంగ నాయకులమ్మ, రామాంజనమ్మ, లక్ష్మీదేవి మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చెవిలో పూలు పెట్టుకుని 3వ రోజు నిరసన కొనసాగించారు. వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు భాస్కర్, మధు, డ్రైవర్ శ్రీను, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో మోకాళ్లపై నిలబడి మున్సిపల్ కార్మికుల నిరసన

డోన్‌లో చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలుతున్న కార్మికులు

పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు సవరం నాగముని

యువత క్రీడల్లో రాణించాలి : వైసిపి

ప్రజాశక్తి - రుద్రవరం

గ్రామస్థాయి నుంచి యువత క్రీడల్లో రాణించాలని వైసీపీ నాయకుడు సవరం నాగముని అన్నారు. గురువారం హరినగరం పంచాయతీ పరిధిలో ఆడదాం ఆంధ్ర పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో యువకులు క్రీడల పట్ల మక్కువ చూపడం లేదన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలను నేర్చుకుని ఆడటం ద్వారా మానసిక ఉల్లాసం, విజ్ఞానం, మనోధైర్యం, స్నేహం, తదితర ప్రయోజనాలు చేకురుతాయన్నారు. యువత గ్రామీణ క్రీడల్లో రాణించి రాష్ట్రస్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఆదిలక్ష్మి, శివ కృష్ణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పాటుపడాలి

ప్రజాశక్తి - చాగలమర్రి : ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యాభివృద్ధికి పాటుపడాలని చాగలమర్రి ఎంఈఓ-2 న్యామతుల్లా కోరారు. గురువారం చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పిల్లలలో గల విద్య నైపుణ్యాలను వెలికి తీయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, ప్రధానోపాధ్యాయుడు కోటయ్య, కార్యదర్శి మౌలాలి పాల్గొన్నారు.

సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి

- సిఐటియు, ఎస్ఎస్‌సి జెఎసి డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

విద్యాశాఖ పరిధిలో పని చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు, ఎస్ఎస్‌సి జెఎసి ఉమ్మడి జిల్లా చైర్మన్ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణంలోని బియస్‌యన్‌యల్ కార్యాలయం ఎదురుగా సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం సమగ్రశిక్షా ఉద్యోగులు నోటికి నల్ల రిబ్బన్‌లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఆర్సీ అమలు చేయకుండా, నెలలు తరబడి వేతనాలు విడుదల చేయకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటన చేసిన మినిమం ఆఫ్ టైమ్ స్కేల్‌పై జీఓలు మీద జీవోలు ఇచ్చినా అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. ఎన్నికల కంటే ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నోటికి నల్ల రిబ్బన్స్ కట్టుకొని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నవరత్నాలు రత్నాలు నవ మోసాలు : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

నవరత్నాలు నవ మోసాలుగా మారాయని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. గురువారం నియోజకవర్గంలోని కోవెలకుంట్ల మండలం భీమినిపాడు, సౌదరదిన్నె గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను, వైసిపి ప్రభుత్వం వైఫల్యాలను వివరించారు. భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుఊ భీమినిపాడు గ్రామ ప్రజలు తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని, టిడిపి పాలనలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నిర్వహించలేక పోయారని విమర్శించారు. గ్రామాలలో పొలాలకి వెళ్లే దారులు అధ్వానస్థితిలో ఉన్నాయని, దేశానికే వెన్నుముక అయిన రైతులను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఎన్నికల ముందు జగన్ రెడ్డి నవరత్నాలు అంటూ డప్పుకొట్టి, ఎన్నికలు అయ్యాక నవరత్నాలు నవ మోసాలు అయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ పరిశీలకులు బాజీ చౌదరి, నాయకులు సునీల్, వెంకట సుబ్బారెడ్డి, మద్దిలేటి, డా. పేరా శ్రీధర్ రెడ్డి, సుబ్బారెడ్డి, దస్తగిరి, కరీముల్లా, మస్తాన్, హుస్సేన్ బాబు, మౌళీశ్వర్ రెడ్డి జనసేన నాయకులు సురేష్, భాస్కర్, గుర్రప్ప,ఓబులేషు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

ఆంగ్లేయులకు ఎదురొడ్డి పోరాడిన ధీశాలి దరిశి చెంచయ్య

- మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

ఆంగ్లేయులకు ఎదురొడ్డిన ధీశాలి దరిశి చెంచయ్య అని పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో స్వాతంత్ర సమరయోధులు, గదర్ వీరుడు దరిశి చెంచయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దరిశి చెంచయ్య చిత్రపటానికి బీసీ రాజారెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లేయులను తరిమి కొట్టేందుకు స్థాపించిన గదర్ పార్టీలో ముఖ్యసభ్యుడు, దక్షిణ భారతదేశంలోనే తొలి రాజకీయ ఖైదీ దరిశి చెంచయ్య ఆంధ్ర వారు అవ్వడం అందరికీ గర్వకారణమన్నారు. దరిశి చెంచయ్య సేవలను ప్రభుత్వాలు గుర్తించక పోవడం బాధాకరం అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో దరిశి చెంచయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సోదరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

జనసేన పార్టీలో చేరిక

పజాశక్తి - ఆళ్లగడ్డ

జనసేన పార్టీలో రోజురోజుకు ఇతర పార్టీల నుంచి వలసలు కొనసాగుతున్నాయి. గురువారం రుద్రవరం మండలం ముత్తులూరు గ్రామానికి చెందిన ముప్పై కుటుంబాల వారు గ్రామ జనసేన పార్టీ నాయకులు ఇల్లూరి ప్రహ్లాద రెడ్డి అధ్వర్యంలో స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఇరిగెల బ్రదర్స్ సమక్షంలో పార్టీలో చేరినారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ నియోజకవర్గ నాయకులు ఇరిగెల రాంపుల్లా రెడ్డి, ఇరిగెల సూర్య నారాయణ రెడ్డిలు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పవన్, చందు, బాల నరసింహ, మాబు హుస్సేన్, సురేష్, మోహన్ రెడ్డి, దస్తగిరి తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పోలిరెడ్డి, హరి, మేకల రామకృష్ణ, పెద్ద బాలయ్య, పెసరాయి చాంద్ బాషా, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరిగెల సోదరుల సమక్షంలో జనసేనలో చేరుతున్న దృశ్యం

పోరాటం ఫలితమే సాగునీరు విడుదల

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మండలంలో ఏపి రైతు, కౌలు రైతు సంఘాలు, రైతుల పోరాటంతో 4 వేల ఎకరాలకు సిద్ధాపురం చెరువు నుంచి సాగునీటి విడుదల చేసినట్లు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ అన్నారు. గురువారం పంట పొలాలకు సాగునీరు విడుదలవుతున్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలం సిద్ధాపురం చెరువు కింద 24 వేల ఎకరాల ఆయకట్టు భూమి ఉందని, ఈ ఖరీఫ్ సీజన్లో వేలాది రూపాయలు అప్పు చేసి ఒకటికి రెండుసార్లు విత్తనాలు వేసి మొలకెత్తకపోవడంతో రైతులు చెడగొట్టారన్నారు. మధ్య కారు పంటగా మినిము, సెనగ పంటను రైతులు మళ్లీ విత్తనాలు వేసుకున్నారని చెప్పారు. తగినంత వర్షాలు పడకపోవడం, చెరువులో నీళ్ల సమృద్ధిగా లేకపోవడంతో వేసిన పంటలు ఎండిపోతుండడంతో రైతు సంఘం నాయకత్వాన ముష్టిపల్లె, నల్ల కాలువ, బాపనంతపురం, కొత్త రామపురం రైతులు బాపనంతపురం గ్రామం వద్ద రాస్తారోకో చేపట్టారన్నారు. రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు, రైతులతో అధికారులు చర్చించి ఇచ్చిన హామీ మేరకు కొంత నీటిని విడుదల చేశారన్నారు. ఆరు గ్రామాల రైతులకు సుమారు 5000 ఎకరాలకు ఈ సాగునీటి వల్ల ఉపయోగం కలుగుతుందని, అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కార్యదర్శి పి.సుధాకర్, అధ్యక్షుడు మాబాషా, ఎం.వీరన్న తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదలను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ తదితరులు

అభివృద్ధి పథంలో మారుమూల గ్రామాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అవుకు

వైసిపి ప్రభుత్వ హయాంలో మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. గురువారం అవుకు మండలంలోని శివవరం గ్రామంలో రూ. 60 లక్షలతో చేపట్టిన సిసి రోడ్లు, మినరల్ వాటర్ ప్లాంట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యుసిఏఈ కరీముల్లా, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, వైసిపి ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు వ్యాపర్ల సుబ్బారెడ్డి, రాంరెడ్డి, రవి ప్రకాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

చెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని హుస్సేనాపురం గ్రామ సమీపంలో రూ.92 లక్షలతో అభివృద్ధి చేస్తున్న బెల్లం వాళ్ళ చెరువు పనులను ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి గురువారం పరిశీలించారు. మండలంలో ఉన్న దాదాపు అన్ని గ్రామాలు వర్షాధారంపై ఆధారపడి రైతులు పంటలు పండించే పరిస్థితి ఉంది. అయితే ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రైతుల పరిస్థితి తెలుసుకుని మండల పరిధిలోని హుసేనాపురం గ్రామ సమీపంలో గల బెల్లం వాళ్ల చెరువుకు రూ. 92 లక్షలు విడుదల చేయించి అభివృద్ధి చేయడంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా గూటుపల్లె చెరువులు కూడా అభివృద్ధి చేస్తే దాదాపు పది పల్లెల వరకు భూగర్భ జలాలు పెరిగి నీటి సమస్య పరిష్కారం అవుతుందని ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, వైసీపీ నాయకులు బీరేలి నాగేశ్వర్రెడ్డి, గూని నాగరాజు, మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, బండకాటి ఎల్ల నాగిరెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, బెల్లం చంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, సంజీవ, శివుడు, లింగారెడ్డి, మెట్ల నాగేశ్వర్ రెడ్డి ,పెద్ద రంగడు, భీమరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టు కార్డులతో నిరసన

5వ పేజీ తరువాయి.. ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 17 రోజులుగా అంగన్వాడీలు తమ న్యాయ సమ్మతమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తుంటే ప్రభుత్వం తెలియదని చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. అంగన్వాడీల సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం, గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, మిని సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, చనిపోయిన వారికి ప్రభుత్వ పరిహారం ఇవ్వాలని తదితరు డిమాండ్లపై ప్రభుత్వానికి అనేకమార్లు విజ్ఞాపనలు చేసినా పెడచెవిన పెట్టడంతో సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని అన్నారు. ప్రజల గొంతుక అంగన్వాడిలని, అలాంటి గొంతుకను విస్మరిస్తే ప్రభుత్వం గొంతుక మూయిస్తారని,వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం, అనుబంధ ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా నిలబడి ఆందోళనలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిఐటియు జిల్లా నాయకులు తోట మద్దులు తదితరులు మాట్లాడారు. **నంద్యాల రూరల్ :** గత 17 రోజులుగా గొంతు పోయేలా అరుస్తున్నా వినిపించుకోని చెవిటి ప్రభుత్వానికి ఉత్తరాలు రాశామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల తెలిపారు. నంద్యాల పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ సిఎం జగన్మోహన్ రెడ్డికి ఉత్తరాలు రాసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తోట మద్దులు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ప్రాజెక్టు కార్యదర్శి టి.సునీత, ప్రాజెక్టు నాయకురాళ్లు నాగరాణి, ప్రసన్న, నీలిమ, లలితమ్మ, సరస్వతి, రాజేశ్వరితో పాటు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **మహానంది :** మహానంది తహసిల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు పోస్ట్ కార్డుల ద్వారా నిరసన చేపట్టారు. అంగన్వాడీ వర్కర్లు చండీ దేవి, సావిత్రి, లక్ష్మీనారాయణ, ఫాతిమా, సరస్వతి, పుష్పకళ, మరియమ్మ, షాహిన్, సావిత్రి, విజయ, ఉమా మహేశ్వరి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద సమ్మె దీక్షా శిబిరం నుండి అంగన్వాడీలు ర్యాలీగా పోస్ట్ ఆఫీస్ వరకు వెళ్లి ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డులు పోస్ట్ చేసి నిరసన తెలిపారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మిదేవి, వెంకటలక్ష్మి, నాయకురాలు రమాదేవి, ఖాదర్ బి, శ్రీదేవి, చంద్ర కళ, ఓబులమ్మ, శేషమ్మ, రాధా బాయి, విజయలక్ష్మి, ప్రియాంక, సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధర్, నాయకులు సురేంద్ర, ఇస్మాయిల్, రైతు సంఘం నాయకులు వీరన్న తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం నుండి అంగన్వాడీలు ర్యాలీగా బయలుదేరి పటేల్ సెంటర్ మీదుగా పోస్ట్ ఆఫీస్ కార్యాలయానికి చేరుకొని సమస్యలను పోస్ట్ కార్డుపై రాసి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి పోస్ట్ చేశారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడి నాయకురాలు మదార్ బి అధ్యక్షత వహించారు. సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, అంగన్‌వాడీలు అక్కమ్మ, శాంత కుమారి, రాజేశ్వరి చంద్రకళ వెంకటలక్ష్మి ఉమాదేవి పుష్పలత, లక్ష్మి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు. **పగిడ్యాల :** పగిడ్యాల తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో పొర్లు దండాలు పెడుతూ అంగన్వాడీలు నిరసన చేపట్టారు. అనంతరం ఎంపీడీవో వెంకటరమణకు, వికాస్ భారత్ సంకల్పయాత్ర కోఆర్డినేటర్ నాగేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, అంగన్వాడి కార్యకర్తలు సాజిదాబి, ఖుషిద్ బి, వరలక్ష్మి, పద్మావతమ్మ, ప్రభావతి, నారాయణమ్మ, స్వర్ణలత, నాగమణి, హైమావతి తదితరులు పాల్గొన్నారు. **మిడుతూరు :** అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు పోస్ట్ కార్డుల ద్వారా నిరసన కార్యక్రమం చేపట్టారు. అంగన్వాడీ యూనియన్ మండల నాయకులు లక్ష్మీ కుమారి, సిఐటియు మండల నాయకులు బి.వెంకట శివుడు అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమానికి టిడిపి నాయకులు నందికొట్కూరు దేవర్ల మురళి, అబ్జర్వర్ కాతా రమేష్ రెడ్డి, దేవనూరు మాజీ సర్పంచి నాగేంద్రుడులు మద్దతు తెలిపారు. నాయకులు జయమ్మ, రాధిక, నాగమణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** అంగన్వాడీలు ముఖ్యమంత్రికి ఉత్తరాలు రాసి నిరసన తెలియజేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు ఈ హరిత, మండల నాయకురాలు నాగమణి, రాజమ్మ, శ్రీదేవి మాట్లాడారు. అనంతరం పెద్ద గుమ్మడాపురం వెళుతున్న నందికొట్కూరు ఎమ్మెల్యే తోగురు ఆర్థర్‌ను అడ్డుకొని వినతి పత్రం అందజేశారు. అంగన్వాడీ కార్యకర్తలు రమణమ్మ, వసంత, మరియమ్మ, లలితమ్మ, శ్యామలమ్మ, ప్రభావతమ్మ తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పోస్ట్ కార్డులో తమ ఆవేదన రాసి ముఖ్యమంత్రికి పోస్ట్ చేశారు. మనోజ, పద్మ, లక్ష్మి, రాఘవేంద్రమ్మ బీబీ,, షాహిన్, బిబి తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం నుండి పాత బస్టాండ్ మెయిన్ బజార్ గాంధీ సెంటర్ వైఎస్ఆర్ విగ్రహం కొత్తమిద్దల కాలనీలోని పోస్ట్ ఆఫీస్ వరకు ర్యాలీగా బయలుదేరి వెళ్లి తమ సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రికి పోస్టులు పంపారు. నాయకులు పద్మావతి, సంజమ్మ, నాగమణి, వై.పద్మావతి, చంద్రకళ, వహీదా, ఇందుమతి, హమాలీ సంఘం అధ్యక్షులు, టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నర్సింహులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** అంగన్వాడీ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎంకే నాగలక్ష్మి, ఎస్ గుల్జార్బి ఆధ్వర్యంలో అంగన్వాడీలు ర్యాలీగా వెళ్లి స్థానిక పోస్ట్ ఆఫీస్‌లో సిఎంకు ఉత్తరాలు పోస్ట్ చేసి నిరసన తెలిపారు. అంతకుముందు పట్టణంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలుపుతూ మద్దతుగా బజారు హమాలీ కార్మికులు దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎల్లయ్య, బజారు హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు డబ్బాల హుస్సేన్, డివైఎఫ్ఐ జిల్ల అధ్యక్షులు ఎం.మధు శేఖర్, అంగన్వాడీలు, కళావతి, మల్లేశ్వరి, ఆదిలక్ష్మి, అనూష, సంతోష, శోభారాణి, మధురవాణి, వరలక్ష్మి దేవి, రాధమ్మ, లక్ష్మీపార్వతి, కరిష్మా, శ్రీదేవి, వెంకటలక్ష్మి, అంజలి, సరోజ, భూలక్ష్మి, విజయమని, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ముఖ్యమంత్రికి ఉత్తరం రాసి పోస్ చేసి నిరసన వ్యక్తం చేశారు. సమ్మెకు ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బన్న మాదిగ, నాయకులు నర్సింహులు, ప్రసాద్, బాలస్వామి మద్దతు తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు రత్నమయ్య, మండల నాయకులు రాజు, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** తాసిల్దార్ కార్యాలయం దగ్గర అంగన్వాడీలు సిఎంకు ఉత్తరాలు రాసి నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు పి దావీదు, పద్మావతి, భాగ్యలక్ష్మి, శ్రీదేవి, త్రివేణి, వసుంధర, రామలక్ష్మి, ప్రభావతి, అనిత, రేణుక, శ్రీదేవి, సరిత తదితరులు పాల్గొన్నారు. **పాణ్యం :** అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డులు పంపి నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి కె భాస్కర్, అంగన్వాడి యూనియన్ మండల నాయకురాలు వెంకటమ్మ, మాబునిస, శ్యామల, మరియమ్మ, హైమావతి, సూర్య ప్రభావతి, అనసూయ, లక్ష్మీదేవి, ప్రభావతి, శివమ్మ, వెంకటమ్మ, భారతి పాల్గొన్నారు. **పాములపాడు :** పాములపాడులో అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు. ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డులు రాసి నిరసన తెలిపారు. రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు శివలక్ష్మి, నాగమద్దమ్మ, నాగమణి, రవణమ్మ బాయ్, శ్రీలత, అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. **బనగానపల్లె :** అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పోస్ట్ కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జే వి సుబ్బయ్య, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి రోజా రమణిలు మాట్లాడారు. యూనియన్ సభ్యులు రమాదేవి, వరలక్ష్మి, శశికళ, సరోజ, మల్లేశ్వరి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి : ఎమ్మెల్యేకు వినతి ఇస్తున్న అంగన్‌వాడీలు

పగిడ్యాల : పొర్లు దండాలు పెడుతున్న అంగన్‌వాడీలు